# ఇంటి నిర్మాణం కూల్చివేత

- కాంగ్రెస్ నేత అండతోనేని ఆరోపణ
- ఠాణామెట్లెక్కిన బాధిత కుటుంబం



ఎల్లారెడ్డిపేటలో బేస్‌మెంట్‌ను కూల్చివేసిన పంచాయతీ అధికారులు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 24: మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయం పక్కన ఓ ఇంటిని తహసీల్దార్, ఏడీ హద్దులు నిర్ణయించకుండా నిర్మిస్తున్నారని పంచాయతీ అధికారులు బేస్‌మెంట్‌ను సోమవారం కూల్చివేశారు. బాధిత కుటుంబం వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన శ్రీరామోజి ప్రేమలత ప్రభుత్వ నిబంధనల మేరకు మూడేండ్ల క్రితం ఇంటి నిర్మాణ అనుమతులు పొందింది. సదరు కుటుంబం బోరుబావి వేసేక్రమంలో అదే కాలనీకి చెందిన ఓ సంఘం సభ్యులు అక్కడ తమ స్థలం ఉందని పనులు నిలిపేశారు. పాత అనుమతి సమయం అయిపోయినందున మరోమారు అర్జీ పెట్టుకొని గతేడాది జూలైలో అనుమతి పొందారు. తర్వాత బోరు బావి వేస్తున్న క్రమంలో తొమ్మిది మంది మరోమారు పనులు ఆపేందుకు ప్రయత్నించగా పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. దీంతో పనులు నిలిపేయడానికి ప్రయత్నించిన 9 మందిపై కేసు నమోదైంది. దీనిపై కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝాకు తమ సమస్య గురించి గతేడాది నవంబర్ 30న తెలుపగా తహసీల్దార్, ఏడీ ఇల్లు స్థలానికి హద్దులు నిర్ణయించి నిర్మాణం జరిగేలా ఆదేశాలు జారీ చేశారు. డిసెంబర్‌లో ఇద్దరు సర్వేయర్లు, పంచాయతీ అధికారులు మోఖా పంచనామా చేశారు. కానీ, అందుకు సంబంధించిన కాపీ ఇవ్వకుండా పనులు ప్రారంభించుకోవచ్చునని తెలుపడంతో ఇల్లు నిర్మాణం మొదలు పెట్టారు. అయితే, బేస్‌మెంట్‌ను నిర్మించుకుంటుండగా అదే కాలనీకి చెందిన కొందరు అక్కడ తమ స్థలముందని కలెక్టర్‌ను సంప్రదించగా డీపీవో తాత్కాలికంగా పనులు నిలిపివేయాలని నోటీసు పంపారు. పనులు నిలిపివేసిన తర్వాత 20 రోజులకు మళ్లీ మొదలు పెట్టారు. దీంతో నిబంధనలను అతిక్రమించి నిర్మాణం చేస్తున్నారని భావిస్తూ సోమవారం రూ.2 లక్షల విలువైన బేస్‌మెంట్, భీములను పంచాయతీ అధికారులు ధ్వంసం చేయగా బాధిత కుటుంబం పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించింది. మండలానికి చెందిన కొందరు కాంగ్రెస్ నాయకుల ఒత్తిడితోనే తమను ఇబ్బందులు పెడుతున్నారని బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కార్యదర్శి ప్రవీణ్‌ను వివరణ కోరగా కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దారు, ఏడీ అధికారులు ఇంటి నిర్మాణానికి హద్దులు ఏర్పాటు చేసిన తర్వాత నిర్మించుకోవాలని, అప్పటి వరకు పనులు నిలిపివేయాలని గత నెలన్నర క్రితం నోటీసులు జారీ చేశామని తెలిపారు. తర్వాత జిల్లా పంచాయతీ అధికారి సైతం నోటీసులు అందించినా వినకుండా పనులు చేపట్టడంతో బేస్‌మెంట్‌ను పాక్షికంగా కూల్చివేసినట్లు చెప్పారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నేత కంచర్ల రవిగౌడ్

# పదవుల కోసం పాకులాడే వ్యక్తి బండి

బీఆర్ఎస్ రాష్ట్ర నేత కంచర్ల రవిగౌడ్

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 24 : కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డికి జాతీయ స్థాయి పదవులపై తప్ప రాష్ట్ర అభివృద్ధిపై ధ్యాస లేదని బీఆర్ఎస్ రాష్ట్ర నేత కంచర్ల రవిగౌడ్ విమర్శించారు. ఈ మేరకు సోమవారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ స్వార్థ ప్రయోజనాల కోసం మాత్రమే బండి సంజయ్, కిషన్‌రెడ్డి పని చేస్తున్నారని ఆరోపించారు. ఏనాడూ రాష్ట్ర ప్రయాజనాలపై వారు కొట్లాడలేదన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం చిల్లి గవ్వ తెచ్చే చేతగాని నాయకులన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్రం నుంచి నిధులు తేవాల్సిన బాధ్యత మీకు లేదా అని ప్రశ్నించారు. రాష్ట్ర అభివృద్ధియే లక్ష్యంగా పని చేసిన కేటీఆర్‌ను విమర్శిస్తే సహించేదిలేదని స్పష్టం చేశారు. అనేక ఐటీ కంపెనీలను రాష్ట్రానికి తెచ్చిన ఘనత కేటీఆర్‌కు మాత్రమే దక్కుతుందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు రాష్ట్రంలో కాలం చెల్లిందన్నారు. రాబోవు ఎన్నికల్లో మీ పార్టీలకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. భూ గర్భజలాలు అడుగంటి రైతులు ఇబ్బందులు పడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిచి మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కేటీఆర్‌ను ఉద్దేశించి మరోసారి ఇష్టానుసారంగా మాట్లాడితే గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అనీల్, తిరుపతి, సంపత్, నిఖిల్, లక్ష్మణ్, సంతోష్, రాజు, అక్రమ్, రాము, నరేశ్ పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 24: వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ బిడ్జి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపారు. సీఐ మాట్లాడుతూ, 35 నుంచి 40 ఏండ్ల మధ్య కలిగి, లైట్ బ్లూకలర్ జీన్స్ ప్యాంట్, కాకి కలర్ టీ షర్ట్ ధరించి ఉన్నాడు. అచూకి తెలిసిన వారు వేములవాడ పోలీస్‌స్టేషన్‌లో సమాచారం గాని, 100 డయల్ చేసి, వివరాలను వెల్లడించాలన్నారు.

# కీచకోపాధ్యాయుడిపై పోక్సో కేసు

- ఆలస్యంగా వెలుగులోకి
- రిమాండ్‌కు తరలింపు

కోనరావుపేట, ఫిబ్రవరి 24: విద్యాబుద్ధులు నేర్పే ఉపాధ్యాయుడు విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో పోక్సో కేసు నమోదైంది. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం నిజామాబాద్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు బ్రహ్మం సామాన్య శాస్త్రం బోధిస్తున్నాడు. రెండు నెలల క్రితం ఓ తరగతి విద్యార్థినులపై అసభ్యకరంగా ప్రవర్తించాడు. అప్పుడు పిల్లలు తమ తల్లిదండ్రుల దృష్టికి తీసుకువెళ్లగా, వెంటనే వారు ప్రధానోపాధ్యాయుడికి ఫిర్యాదు చేశారు. దీంతో హెచ్ఎం పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేశారు. స్కూల్ చైర్మన్‌తో మాట్లాడి మరోసారి పునరావృతం కాకుండా చూడాలని సదరు ఉపాధ్యాయుడిని మందలించారు. నాలుగు రోజు క్రితం పాఠశాలలో 'పోలీస్ అక్క' కార్యక్రమం మహిళ పోలీస్ నిర్వహించారు. ఈక్రమంలో మహిళ పోలీస్ గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థినులు ఉపాధ్యాయుడు చేసిన అసభ్యకర ప్రవర్తన మహిళ పోలీస్‌కు వివరించారు. దీంతో స్పందించిన పోలీసులు, సదరు టీచర్‌పై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

## విద్యార్థుల క్షేత్ర పర్యటన

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 25 : అగ్రహారం డిగ్రీ కళాశాల విద్యార్థులు సోమవారం జిజ్ఞాస స్టడి ప్రాజెక్టులో భాగంగా వేములవాడ కేడీసీసీబీ బ్యాంక్‌లో క్షేత పర్యటన చేశారని కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, జిజ్ఞాస స్టూడెంట్స్ స్టడీ ప్రాజెక్ట్‌లో భాగంగా బ్రాంచ్ మేనేజర్లతో ఖాతాదారులకు ఇచ్చేలా రుణాలు వాటి వడ్డి రేట్లపై వివరించారు. ఈ కార్యక్రమంలో కామర్స్ విభాగ అధిపతి డాక్టర్ లావణ్య, పర్యవేక్షకుడు నర్సయ్య, విద్యార్థులు రాజేశ్, యశ్వంత్, భవతి, ఉషారాణి, రాణి పాల్గొన్నారు.

# పోలింగ్ పారదర్శకంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న సీపీవో శ్రీనివాసాచారి

- ట్రైనింగ్ నోడల్ అధికారి, సీపీవో శ్రీనివాసాచారి

కలెక్టరేట్, ఫిబ్రవరి 24 : శాసన మండలి ఎన్నికల పోలింగ్ పారదర్శకంగా నిర్వహించాలని ట్రైనింగ్ నోడల్ అధికారి, సీపీవో శ్రీనివాసాచారి అన్నారు. ఈ నెల 27న జిల్లాలో నిర్వహించనున్న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా కలెక్టరేట్‌లో సోమవారం ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఓపీవోలు, మైక్రో అబ్జర్వర్లకు పోలింగ్ నిర్వహణపై శిక్షణ కల్పించారు. ఈ శిక్షణలో శ్రీనివాసాచారి మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణలో ప్రతి ఒక్కరికీ అనుభవం ఉందని, ఎక్కడా తేలికగా తీసుకోకుండా పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం 28 పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం 13 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, నిబంధనలు పాటిస్తూ పోలింగ్ సజావుగా జరపాలన్నారు. పోలింగ్ విధులపై ఏవైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటర్ స్లిప్ పంపిణీ చేయాలని ఆదేశించారు. ఈ నెల 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. ఈ నెల 26న డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి వచ్చి పోలింగ్ డ్యూటీ అలాట్మెంట్ ఆర్డర్ తీసుకొని సంబంధిత పోలింగ్ కేంద్రం సిబ్బందితో కలిసి సామగ్రి తీసుకోవాలన్నారు. అవసరమైన మేర సరైన బ్యాలెట్ పత్రాలు, ఓటరు జాబితా, ఇతర ముఖ్యమైన పోలింగ్ సామగ్రి చెక్ లిస్ట్ తయారు చేసుకొని అన్ని అందుబాటులో ఉన్నాయో లేదో ఒకటికి రెండుసార్లు పరిశీలించాలన్నారు. పోలింగ్ రోజు ఉదయం ఖాళీగా ఉన్న బ్యాలెట్ బాక్స్‌ను ఏజెంట్లకు చూపించాలని, గ్రీన్ పేపర్‌లో ఏజెంట్ల సంతకాలు తీసుకుని సీజ్ చేయాలన్నారు. బ్యాలెట్ బాక్స్‌పై పోలింగ్ కేంద్రం వివరాలు ఉండేలా పేపర్ అతికించాలన్నారు. విధులను పక్కాగా నిర్వర్తిస్తూ ప్రశాంతంగా ఓటింగ్ జరిగేలా చూడాలన్నారు. శిక్షణలో పీవో 40, ఏపీవోలు 40, ఓపీవోలు 88, మైక్రో అబ్జర్వర్స్ 15 మంది పాల్గొన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటు కోసం మొత్తం ఆరుగురు దరఖాస్తు చేసుకున్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, మాస్టర్ ట్రైనర్లు మహేందర్ రెడ్డి, శ్రీధర్ పాల్గొన్నారు.

# భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

- ప్రణాళికా బద్ధంగా ఎమ్మెల్సీ ఎన్నికల విధులు
- ఎస్పీ అఖిల్ మహాజన్



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

వేములవాడ, ఫిబ్రవరి 24 : వేములవాడ రాజన్న సన్నిధిలో నిర్వహించే మహాశివరాత్రి వేడుకకు హాజరయ్యే భక్తులకు ప్రశాంత వాతావరణంలో స్వామివారిని దర్శించుకునేలా పోలీస్ సిబ్బంది విధులు నిర్వర్తించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. సోమవారం మహాశివరాత్రి జాతర, ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా విధులకు హాజరయ్యే పోలీస్ అధికారులు, సిబ్బందికి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విధులు కేటాయించి మాట్లాడారు. 25వ తేదీ నుంచి 27 వరకు నిర్వహించే మహాశివరాత్రి జాతర సందర్భంగా పోలీస్ శాఖ తరుపున సుమారు 1500 పోలీస్ అధికారులు, సిబ్బందితో పటిష్ట భద్రత ఏర్పాటు చేశామన్నారు. అలాగే ఈ నెల 27వ తేదీన ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో పోలీసు అధికారులు ఎలక్షన్ ముందు, ఎలక్షన్ రోజు, ఎలక్షన్ తర్వాత, తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల సమయంలో పోలీసుల పాత్ర అత్యంత కీలకమన్నారు. పోలింగ్ ప్రక్రియ సజావుగా, నిష్పక్షపాతంగా సాగేందుకు పటిష్టవంతంగా విధులు నిర్వర్తించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయ, పట్టభద్రుల పోలింగ్‌కు సంబంధించి 41 పోలింగ్ కేంద్రంలో 23,347 మంది ఓటర్లు వారి ఓటు హక్కును వినియోగించుకుంటారని తెలిపారు. పోలింగ్ ప్రక్రియ మొదలైనప్పటి నుంచి పూర్తి అయేంత వరకు పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలింగ్ ప్రక్రియ ముగిసిన తరువాత బ్యాలెట్ బాక్స్‌లను పటిష్టమైన ఎస్కార్ట్‌తో స్ట్రాంగ్ రూమ్‌కు తరలించాలన్నారు. అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సీఐలు వీరప్రసాద్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, మొగిలి, ఆర్ఐలు, ఎస్ఐలు ఉన్నారు.

## పరిశోధనలతోనే వైజ్ఞానిక ప్రగతి

తెలంగాణ చౌక్, ఫిబ్రవరి 24 : విద్యార్థులకు చిన్ననాటి నుంచే వివిధ అంశాలపై పరిశోధనా శక్తిని పెంపొందించుకుంటెనే వైజ్ఞానిక ప్రగతిని సాధిస్తారని పాఠశాల కరస్పాండెంట్ రాజురెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో సైన్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నూతన ఆవిష్కరణలతో ఆకట్టుకున్నారు. ఇందులో భాగంగా కలామ్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యూత్ ఎక్సలెన్స్ సహకారంతో నూతన శాటిలైట్, రాకెట్స్, మిసైల్స్‌ను రూపొందించి, వాటి వినియోగాలను తోటి విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



వివరిస్తున్న విద్యార్థులు

## ఒకరిపై కేసు

తెలంగాణ చౌక్, ఫిబ్రవరి 24 : గంజాయితో పట్టుబడిన వ్యక్తిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు టౌన్ సీఐ కృష్ణ సోమవారం ప్రకటన ద్వారా వివరాలు తెలిపారు. ఈ మేరకు సిరిసిల్ల పట్టణం వెంకంపేటకు చెందిన గుర్రం పవన్ మరో వ్యక్తితో కలిసి పది రోజుల క్రితం మహారాష్ట్రకు వెళ్లి అక్కడ నుంచి చెరో 200గ్రాముల గంజాయిని కొనుగోలు చేసి, తీసుకువచ్చినట్లు తెలిపారు. ఆ గంజాయిని పట్టణంలోని ఎల్లమ్మ సర్కిల్ వద్ద తాగి, ఇతరులకు విక్రయించే క్రమంలో నిందితుడిని పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. అతడి వద్ద నుంచి 57 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

## గంజాయి కేసులో ఇద్దరికి ఐదేళ్ల జైలు

గాంధీ చౌక్, ఫిబ్రవరి 24 : గంజాయి అక్రమ రవాణా కేసులో ఇద్దరికి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు యాభై వేల చొప్పున జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రధాన న్యాయమూర్తి ఎన్ ప్రేమలత సోమవారం తీర్పు నిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన వడిచెర్ల జాన్‌ప్రతాప్‌రెడ్డి, నాంపల్లి గ్రామానికి గుమ్మడి వెళ్లి చంద్రశేఖర్ 8 జూన్ 2020 రోజున వేములవాడ పట్టణ పరిధిలో గంజాయి రవాణా చేస్తున్నారన్న సమాచారం మేరకు.. వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 3.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసుకుని చార్జిషీట్ దాఖలు చేసి, కోర్టులో హాజరపరిచారు. కాగా, సోమవారం అడిషనల్ పీపీ వేముల లక్ష్మీప్రసాద్ కేసును వాదించగా, కేసు పూర్వ పరాలను పరిశీలించిన న్యాయమూర్తి వారికి ఐదేళ్ల జైలు శిక్ష తో పాటు రూ. 50 వేల చొప్పున జరిమానా విధించారు.

## ఆరోగ్యం, పౌష్టికామారంపై అవగాహన..




సమావేశంలో మాట్లాడుతున్న ఎండీవో శశికళ

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 24 : ఆదర్శ మండల సమాఖ్య కార్యాలయంలో సోమవారం ఆరోగ్య, పౌష్టికాహారంపై వీవోఏలు, వీవో ఏబీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శశికల మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. గర్భిణీ, బాలింతలు పౌష్టికారాహారం తీసుకోవాలన్నారు. పిల్లలకు టీకాలు వేయించాలన్నారు. అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏపీఎం వాణిశ్రీ, మండల వైద్యాధికారిని జీవన జ్యోతి, ఐసీడీఎస్ సూపర్ వైజర్ చంద్రకల, సీహెచ్‌వో శాంత, మండల సమాఖ్య ఓబీలు వనజ, కావ్య, పద్మ, ప్రమోద, సీసీలు వెంకటేశం, సదయ్య, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ ఏజెంట్‌పై కేసు నమోదు

తెలంగాణ చౌక్, ఫిబ్రవరి 24: పోలాండ్ దేశం పంపిస్తానని డబ్బులు తీసుకొని మోసం చేసిన నకిలీ ఏజెంట్‌పై కేసు నమోదు చేసి, అరెస్టు చేసినట్లు టౌన్ సీఐ కృష్ణ సోమవారం తెలిపారు. ఈ మేరకు పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన చిలుక శ్రీధర్ వద్ద కామారెడ్డి జిల్లా రామారెడ్డికి చెందిన ఏజెంట్ సాయగౌడ్ అనే వ్యక్తి సంవత్సరం కిత్రం పోలాండ్ దేశానికి పంపిస్తానని రూ. 60 వేయిలు తీసుకొని పంపించకుండా మోసం చేసినట్లు తెలిపారు. బాధితుడు శ్రీధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, అరెస్టు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. నిందితుడు సాయగౌడ్ బాధితులు ఇంకా ఎవ్వరైనా ఉంటే నేరుగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

## రోడ్డుపై గుంత.. ప్రయాణికుల తంటా



ప్రధాన రోడ్డుపై ఏర్పడిన గుంత

కోనరావుపేట, ఫిబ్రవరి 24: వేములవాడ నుంచి సిరికొండ వెళ్లే ప్రధాన రహదారిలో మామిడిపల్లి, హన్మజీపేట గ్రామాల మధ్యలో రోడ్లపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. దీంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇటీవల గుంతలో పడి మామిడిపల్లి గ్రామానికి చెందిన నలిమేటి లక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.



సమగ్ర సర్వే చేస్తున్న పంచాయతీ కార్యదర్శి రాజయ్య

## వెంకట్రావుపల్లిలో సమగ్ర సర్వే

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 24 : మండలంలోని వెంకట్రావుపల్లిలో సోమవారం సమగ్ర సర్వేను పంచాయతీ కార్యదర్శి రాజయ్య ఇంటింటా తిరిగి సర్వే చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో సమగ్ర సర్వేను ఈ గ్రామస్తులు తిరస్కరించారు. అధికారులు గ్రామస్తులకు అవగాహన కల్పించి సమగ్ర సర్వేకు గ్రామస్తులు సహకరించడంతో అధికారులు నిర్వహించారు.

## ఓపెన్ జిమ్ అస్తవ్యస్తం



పాడయి పోయిన జిమ్ పరికరాలు

కోనరావుపేట, ఫిబ్రవరి 24: మండలంలోని నాగారం గ్రామంలో ప్రతిమ స్వచ్ఛంద సంస్థ లక్షలు వెచ్చించి ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయగా, అస్తవ్యస్తంగా మారింది. నిర్వహణ లేక జిమ్‌లోని పరికరాలు పూర్తిగా పాడయ్యాయి. లక్షలు వెచ్చించి జిమ్ పరికరాలు ఏర్పాటు చేస్తే నిర్వహణ గాలికవదిలేయడంపై గ్రామస్తులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు ప్రత్యేక చొరవ చూపి, వాటిని వినియోగంలోకి తీసుకురావాలని కోరారు.

# ఒప్పందం ప్రకారం కూలీ చెల్లించాలి



పాలిస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడికి వినతిపత్రం అందజేస్తున్న జిల్లా పవర్‌లూం వర్కర్స్ యూనియన్ నాయకులు

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 24 : ఒప్పందం ప్రకారం కార్మికులకు కూలీ చెల్లించాలని జిల్లా పవర్‌లూం వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కోడం రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పాలిస్టర్ వస్త్రానికి పవర్‌లూమ్ కార్మికులకు కూలీ తగ్గించకుండా ఒప్పందం ప్రకారం.. చెల్లించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని పాలిస్టర్ అసోసియేషన్ భవనం ఎదుట ధర్నా చేసి. పాలిస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడికి వినతిపత్రం అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, పవర్ లూమ్ కార్మికులకు పాలిస్టర్ వస్త్రానికి కార్మికులకు కూలీ తగ్గించకుండా వెంటనే ఒప్పందం ప్రకారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పాలిస్టర్ వస్త్రానికి కార్మికులకు 2022 ఏప్రిల్ 20వ తేదీన కూలీ ఒప్పందం జరిగిందని, కానీ, ప్రస్తుతం ఒప్పందం ప్రకారం కూలీ పెంచి ఇవ్వకుండా తగ్గించి ఇవ్వడంతో కార్మికుడు రోజుకు దాదాపు రూ.100 నష్టపోతున్నారన్నారు. ఒప్పందం గడువు సైతం 2024 ఏప్రిల్‌లోనే ముగిసిందని కనీస స్పందన లేదన్నారు. వెంటనే డిమాండ్ నోటీస్‌పై చర్చలు జరిపి కూలీ పెంచి అగ్రిమెంట్ చేయాలన్నారు. లేకుంటే కార్మికులు తీసుకునే నిర్ణయాలకు మీరే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. మూసం రమేశ్, నక్క దేవదాస్, సురేశ్, శ్రీధర్ ఉన్నారు.

# తండ్రి కోసం వెళ్తూ.. కొడుకు మృత్యుఒడికి

- రోడ్డు ప్రమాదంలో బాలుడి దుర్మరణం
- ఒక్కగానొక్క కొడుకు మృతితో తల్లిదండ్రుల కన్నీరుమున్నీరు



జంగ నిశాంత్ (ఫైల్)

ముస్తాబాద్/ సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 24 : తండ్రిని కలిసేందుకు వెళ్తూ కొడుకు మృత్యు ఒడికి చేరాడు. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ముస్తాబాద్ మండలం పోతుగల్‌కు చెందిన జంగ భూమయ్య-రేణవ్వ దంపతులకు ఒక్కగానొక్క కొడుకు నిశాంత్ (15) పోతుగల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. తన తండ్రి జంగ భూమయ్య తంగళ్లపల్లి మండలం జిల్లెల గ్రామం లో సీసీ రోడ్డు పనులకు ట్రాక్టర్ నడుపుతున్నాడు. మూడు రోజుల నుంచి తండ్రి ఇంటికి రాలేదు. దీంతో నిశాంత్ తన తండ్రిని కలిసేందుకు సోమవారం ఉదయం బైక్‌పై తన మిత్రుడు జంగిటి బన్నితో కలిసి పోతుగల్ నుంచి బయలుదేరాడు. సారంపల్లి బస్టాండ్ సమీపంలో ఆర్టీసీ బస్సు-బైక్ ఢీ కొన్నది. దీంతో నిశాంత్ బస్సు ముందు చక్రాల కింద పడ్డాడు. తల పగిలి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. వెనక కూర్చు న్న బన్ని గాయపడగా, ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు తంగళ్లపల్లి ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. నిశాంత్ మృతికి పోతుగల్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు మౌనం పాటించారు. పాఠశాలకు సెలవు ప్రకటించినట్టు హెచ్ఎం రాధాకిషన్‌రావు తెలిపారు.

## విద్యార్థులకు టాలెంట్ టెస్ట్

ముస్తాబాద్, ఫిబ్రవరి 24: పదో తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్టులు అవసరమని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కల్యాణ్‌కుమార్ అన్నారు. దీనిలో భాగంగా జిల్లా వ్యాప్తంగా విద్యార్థులకు టాలెంట్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీ పరీక్షలు రాసి వచ్చే పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ టాలెంట్ టెస్ట్‌లో టాపర్‌గా నిలిచిన విద్యార్థులకు జిల్లా స్థాయి మండల స్థాయి బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.



టాలెంట్ టెస్ట్ రాస్తున్న విద్యార్థులు

## డ్రోన్‌తో తెగుళ్ల నివారణకు మందు పిచికారీ



తెగుళ్ల నివారణకు మందు పిచికారీ చేయిస్తున్న రైతు

రుద్రంగి, ఫిబ్రవరి 24 : మండల కేంద్రంలో గ్రోమోర్ కంపెనీ ఆధ్వర్యంలో సోమవారం డ్రోన్ ద్వారా వరి సాగులో తెగుళ్ల నివారణకు మందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, డ్రోన్ వినియోగంతో కూలీల సమస్యను అధిగమించడమే కాకుండా పురుగు మందులపై పెట్టే ఖర్చు తగ్గుతుందన్నారు. రైతుకు దిగుబడి పెరిగి లబ్ధి పొందుతారని సూచించారు. డ్రోన్ ద్వారా తక్కువ సమయంలో పంటలకు కలుపు మందులతో పాటు తెగుళ్ల నివారణకు రసాయన ఎరువులు తక్కువ మందుతో పిచికారీ చేయవచ్చని తెలిపారు. డ్రోన్ ద్వారా కలుపు, తెగుళ్లకు మందు పిచికారీ చేస్తే ఎకరాకు రూ. 400 చార్జీ అవుతుందని డ్రోన్ ఆపరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డ్రోన్ ఆపరేటర్ విక్రమ్, రైతులు గంగం మహేశ్, సనుగుల గంగాధర్, మీసాల అజయ్ ఉన్నారు.

# వన దహనంపై గ్రామస్తులకు అవగాహన

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 24 : వనదహనంపై అల్మాస్‌పూర్‌కు గ్రామస్తులకు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పద్మాలత అవగాహన కల్పించారు. సోమవారం అల్మాస్‌పూర్ అటవీ ప్రాంతంలో పశువుల కాపరులు, గ్రామస్తులు చేసే పలు రకాల చర్యలపై అడవులకు మంటలంటుకునే తీరుపై వివరించారు. దీంతో అడవిలో ఉండే జీవరాశులకు, పర్యావరణానికి మానవులకు జరిగే నష్టంపై వివరించారు. దీంతో పాటు వనదహనం జరకుండా తీసుకునే నివారణ చర్యలను సూచించారు. ఈ కార్యక్రమంలో బీటీ ఆఫీసర్ సతీశ్, బేస్‌క్యాంప్ సిబ్బంది ఉన్నారు.



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు